నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, గురువారం 13 జూన్ 2024 | NALGONDA



సూర్యాపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

# సర్కారు పాఠశాలల్లోనే ఉత్తమ విద్య

- బంగారు భవితకు బాట వేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు
- మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి
- సూర్యాపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తుల పంపిణీ

సూర్యాపేట టౌన్, మే 12 : విద్యార్థులను ఉత్తమ విలువలతో కూడిన ఉన్నతమైన శిఖరాలు చేర్చేందుకు తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు సకల సౌకర్యాలతో ఎంతగానో అభివృద్ధి చెందాయని, బాల బాలికల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే దిశగా ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరక్ష్యరాస్యతను ప్రారదోలాలని, ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా మారి సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అన్నారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే, బీఆర్ అంబేద్కర్‌ల ఆశయాలను సాధించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉంటారని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ ఏడాది చాలా మంది ప్రభుత్వ విద్యార్థులు టెన్త్‌లో 10 జీపీఏ సాధించారని, ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, జడ్పీటీసీ జీడి భిక్షం, కౌన్సిలర్ తాహేర్ పాషా, ఆర్డీఓ వేణుమాధవ రావు, తాసీల్దార్ శ్యామ్‌సుందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంఈఓ శైలజ, ఎండీఓ బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోలి పద్మాకరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# స్కూళ్లు పునఃప్రారంభం

## తొలిరోజు బడిబాట పట్టిన విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ
- పూర్తికాని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు.. అసౌకర్యాలతో విద్యార్థుల ఇబ్బందులు

రామగిరి, జూన్ 12 : విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి బడిబాట పట్టారు. నెలన్నర వేసవి సెలవుల తర్వాత బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమవడంతో అంతటా బడి గంటలు మోగాయి. తొలిరోజు మామిడి తోరణాలు కట్టి పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫామ్ అందజేశారు. మొదటి రోజు స్కూళ్ల వద్ద సందడిగా కనిపించింది. తమ పిల్లలను తయారు చేసి లంచ్ బాక్సు పెట్టడం, ఆటోలు, సైకిళ్లు, బైక్‌లపై తీసుకెళ్లి పాఠశాల దగ్గర దింపడం వంటి పనులతో తల్లిదండ్రులు తీరికలేకుండా గడిపారు. పిల్లలు కూడా ఫస్ట్‌డే కావడంతో ఎంతో ఉత్సాహంతో పాఠశాలకు తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,381 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 5,34,502 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మరమ్మతు పనులు చేపట్టగా చాలా స్కూళ్లలో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. టాయ్‌లెట్స్, తరగతి గదులు, వంట గదులు తదితర పనులు పూర్తి కాలేదు. దాంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. పలు చోట్ల మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడ్డారు.



నల్లగొండ ఆర్‌పీ రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరిచందన, డీఈవో భిక్షపతి



నల్లగొండలోని బాలికల ఉన్నత పాఠశాలలో ముగ్గులు వేసి అలంకరిస్తున్న విద్యార్థినులు

## జిల్లా కేంద్రంలో 9 గంటలైనా తెరుచుకోని బడి

నల్లగొండ జిల్లా కేంద్రంలోని బోయవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9గంటల విద్యార్థులకు పాఠశాలకు వచ్చారు. కానీ అప్పటివరకు ఉపాధ్యాయులెవరూ రాలేదు. తరగతి గదులకు తాళాలు వేసి ఉండటంతో టీచర్స్ రాకకోసం విద్యార్థులు ఎదురుచూస్తూ ఉండిపోయారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు వచ్చారు. జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయుల పనితీరు ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో సమయపాలన పాటిస్తున్నారా? లేదా అనే సందేహాలను తల్లిదండ్రులు, పలువురు విద్యావేత్తలు అసహనం వ్యక్తం చేశారు.



బోయవాడలోని ప్రభుత్వ పాఠశాలలో 9 గంటలకు కూడా గది తాళాలు తీయకపోవడంతో ఎదురుచూస్తున్న విద్యార్థులు

# రాజకీయ కోణంతోనే అవిశ్వాసం

### కోరం లేక డీసీసీబీ సమావేశం వాయిదా

### డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నీలగిరి, జూన్ 12 : రాజకీయ కోణంతోనే తనపై అవిశ్వాసం నోటీసు ఇచ్చినట్లు భావిస్తున్నానని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం డీసీసీబీ పాలకవర్గ సమావేశం కోరం లేక వాయిదా పడింది. అనంతరం చైర్మన్ మహేందర్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనకు ఇష్టమైన సహకార రంగంలో 1987 నుంచి వివిధ పదవులకు పోటీ చేస్తూ డీసీసీబీ చైర్మన్, రాష్ట్ర ఎస్కాబ్ వైస్ చైర్మన్ స్థాయికి ఎదిగిన మచ్చలేని నాయకుడినన్నారు. 36 సంవత్సరాలపాటు పీఏసీఎస్ చైర్మన్‌గా, 9 సంవత్సరాలు డీసీసీబీ డైరెక్టర్‌గా, 2020 నుంచి డీసీసీబీ చైర్మన్‌గా పని చేస్తున్నానని తెలిపారు. తన అనుభవాన్ని చూసి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి బ్యాంకు చైర్మన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. 107 సంవత్సరాల చరిత్ర కలిగి నష్టాల బాటలో ఉన్న బ్యాంకును లాభాల్లోకి తెచ్చానని, రూ.900 కోట్ల టర్నోవర్ నుంచి రూ.2,400 కోట్ల టర్నోవర్‌కు బ్యాంకు లావాదేవీలను పెంచానని చెప్పారు. 11 శాతంగా ఉన్న ఎన్‌పీఏను 1.83 శాతానికి తీసుకొచ్చి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిపామని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ బ్యాంకు చైర్మన్ అవార్డు తీసుకుని బ్యాంకు ప్రతిష్టను పెంచామని చెప్పారు. రాష్ట్రంలో ఏ సహకార బ్యాంకూ అందించని విధంగా రైతు బిడ్డల విదేశీ విద్య కోసం విద్యా రుణాలు ప్రవేశ పెట్టి 1500 మందికి రూ.118 కోట్ల రుణాలు అందించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపామన్నారు. దీనికి బ్యాంకు వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు అందించిన సహకారమే కారణమని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో బ్యాంకు టర్నోవర్ రూ.3 వేల కోట్లకు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అవిశ్వాసం వీగిపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రంగాచారి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

# పూర్తికాని మరుగుదొడ్లు

- తొలిరోజే విద్యార్థులకు సమస్యల స్వాగతం

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. స్కూల్ ప్రారంభమైన తొలినాడే విద్యార్థులకు ఇబ్బందులు స్వాగతం పలికాయి. మరుగుదొడ్ల మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ఆ పాఠశాల పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమ్మ ఆదర్శ కమిటీ సమక్షంలో వాటిని పూర్తి చేయాల్సి ఉన్నా పనుల్లో జాప్యం చేయడంతో పూర్తి కాలేదు. వాటికి నీటి సౌకర్యం అందించేందుకు గుంతలు తీసి వదిలేశారు. ఇప్పటివరకు పైపు లైన్ కలిపి గుంత పూడ్చలేదు. దీంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం తాగేందుకు మంచీనీరు కూడా లేదు. మధ్యాహ్న భోజనం కూడా వండలేదు. వంట గది కూడా అంతంత మాత్రమే. దినికితోడు పాఠశాల ప్రహరీ గోడ లేక ప్లాస్టిక్ కంచె చుట్టారు. ఇలాంటి పాఠశాలలు చాలానే ఉన్నాయి.



చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులు పూర్తికాని మరుగుదొడ్లు

## ప్రారంభం రోజే పాఠశాల శుభ్రం

మఠంపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్కూల్ ప్రారంభం రోజే శుభ్రపరిచారు. దాంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై ఉపాధ్యాయులను వివరణ కోరగా స్కావెంజర్స్ లేక గ్రామ పంచాయితీ సిబ్బంది సహకారంతో శుభ్రం చేసినట్లు తెలిపారు. ఇక మండలంలోని లాలితండాలో కరోనా తర్వాత మూతపడిన పాఠశాల ఈ సంవత్సరం ప్రారంభించడంతో ఒక్క విద్యార్థి పేరు కూడా నమోదు కాలేదు. మండలంలో విద్యార్థులు లేక పాఠశాలలు వెల వెలబోయాయి.



మఠంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రారంభం రోజే సామగ్రిని బయటపెట్టి శుభ్రం చేస్తున్న సిబ్బంది

# దామరచర్లలో భారీ వర్షం

- ఇండ్లలోకి చేరిన నీరు.. చెట్టుపై పడ్డ పిడుగు

దామరచర్ల, జూన్ 50 : దామరచర్ల మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు ఆగకుండా పడడంతో లోతట్టు ప్రాంతాలకు వరద పోటెత్తింది. మండల కేంద్రంలోని ఎర్రనాము, రెడ్డి కాలనీలోని ఇండ్లలోకి వాననీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ సబ్ యార్డు సమీపంలో చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు కాలిపోయింది. వరదనీరు ఇండ్లలోకి వెళ్లడంతోపాటు ఉరుములు కారణంగా రిఫ్రిజిరేటర్లు, టీవీలు కాలిపోయినట్లు కాలనీ వాసులు తెలిపారు. మండల కేంద్రంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికే ఇండ్లలోకి నీరు ప్రవేశించి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు.



దామరచర్లలో పిడుగు పడటంతో కాలిపోతున్న చెట్టు

### సూర్యాపేటలో గాలివాన బీభత్సం

బొడ్రాయి బజార్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా అరగంటపాటు గాలితో కూడిన వర్షం రావడంతో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకూలాయి. రేకుల డబ్బాలు కొట్టుకుపోయాయి. చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



సూర్యాపేట చర్చి కాంపౌండ్‌లో కారు మీద విరిగి పడిన చెట్టు

# యథేచ్ఛగా గుట్కా దందా

- నిషేధం ఉన్నా గల్లీగల్లీలో విక్రయాలు
- వివిధ ప్రాంతాల నుంచి సూర్యాపేట, కోదాడకు రాక
- పట్టించుకోని అధికారులు

సూర్యాపేట, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : నిషేధిత గుట్కాల అక్రమ వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతున్నది. గుల్బర్గా, బీదర్ తదితర ప్రాంతాల నుంచి అక్రమార్కులు మాఫియాగా ఏర్పడి పెద్ద ఎత్తున రవాణా చేస్తుండడంతో మార్కెట్లలో విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. గుట్కా తింటే అనేక వ్యాధులతోపాటు క్యాన్సర్ బారిన పడుతారనేది సత్యం. ప్రభుత్వాలు గుట్కాలను పూర్తిగా నిషేధించాయి. నిషేధాన్ని ఆసరాగా చేసుకొని జిల్లా వ్యాప్తంగా కొంతమంది అక్రమార్కులు దొంగ వ్యాపారానికి తెరలేపారు. పట్టణాలు, మండల కేంద్రాలే కాదు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇవి దొరుకుతున్నాయి. సూర్యాపేట, కోదాడకు చెందిన కొంతమంది కంటైనర్‌లలోనే గుట్కా ప్యాకెట్లను పెద్ద ఎత్తున తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. దొంగతనంగా తెచ్చిన గుట్కాలను సాధారణ ధర కంటే 30 నుంచి 50 రెట్లు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నియంత్రించాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటుపడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. గుట్కాలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నా కొన్ని మాత్రమే కేసులు నమోదవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ డబ్బా కొట్టులో బహిరంగంగా వేలాడదీసిన నిషేధిత గుట్కాలు

### బీదర్, గుల్బర్గా నుంచి..

ప్రభుత్వం ఏదైనా హానికరమైన వాటిని నిషేధిస్తే అది కొంతమందికి వరంగా మారుతుంది. అందులో ప్రధానమైంది గుట్కాలు. గత ఉమ్మడి రాష్ట్రంలో 2013 జనవరి 9న అప్పటి ప్రభుత్వం గుట్కాలను నిషేధించింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా నిషేధం కొనసాగిస్తూ వస్తున్నాయి. నిషేధానికి ముందు మార్కెట్‌లో ఏ స్థాయిలో వివిధ కంపెనీల గుట్కా ప్యాకెట్లు లభించాయో నేడు అదే రీతిన లభిస్తుండడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో ప్రతి పట్టణం, పల్లెల్లోని డబ్బా కొట్లలో గుట్కా ప్యాకెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం డైలీ పార్సిల్ సర్వీసులు, వివిధ ట్రాన్స్‌పోర్టులు, కంటైనర్లు తదితర మార్గాల ద్వారా వీటిని సరఫరా చేస్తున్నారు. ఇలా యథేచ్ఛగా కొనసాగడానికి అధికారుల పాత్ర ఇతోధికంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్కాల వ్యాపారమే నిషేధం కాగా వాటిని అక్రమంగా తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బీదర్, గుల్బర్గాతోపాటు హైదరాబాద్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ నుంచి సూర్యాపేట, కోదాడలకు చేరుకుంటుండగా అక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. ప్రధానంగా విమల్, సాగర్, చేతావాని, అంబర్ తదితర గుట్కాలు జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. రూ. 2లకు లభించే ప్యాకెట్ రూ. 10 నుంచి రూ. 15 పాయల వరకు విక్రయిస్తున్నారు. మనిషి ఆరోగ్యాన్ని హరించే ఈ గుట్కాల అక్రమ దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## అగ్నిపథ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

నీలగిరి, జూన్ 12 : అగ్నిపథ్ పథకం (02/2025)లో భాగంగా భారత వైమానిక దళంలో అగ్ని వీర్వాయుగా చేరడానికి ఆసక్తి కలిగిన అవివాహిత పురుష, స్త్రీ అభ్యర్థులు జూలై 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. http:agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో జూలై 3, 2004 నుంచి జనవరి3, 2008 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ రుసుం రూ.550తోపాటు జీఎస్టీ కట్టాలని, దరఖాస్తు చేసుకున్న వారికి అక్టోబర్ 18న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## బ్యూటీ, హెల్త్‌కేర్‌లో ఉచిత శిక్షణ

నీలగిరి, జూన్ 12 : దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం, మహిళా ప్రాంగణంలో బ్యూటీ, హెల్త్ కేర్ కోర్సులో ఉచిత శిక్షణకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఎ.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ, హెల్త్‌కేర్‌కు 8వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయి 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని, నెల రోజులపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థినులు జీరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు, ఆధార్ జీరాక్స్ కాపీలతో నల్లగొండ మహిళా ప్రాంగణంలో ఈ నెల 16 లోపు సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7660022517, 08682244416 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు విద్యార్థుల ఎంపిక



లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి

నీలగిరి, జూన్ 12 : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద 2024– 25 విద్యా సంవత్సరానికి 3,5,8వ తరగతిలో ప్రవేశాలకు 114 గిరిజన విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్ బుధవారం లక్కీ డ్రాను నల్లగొండ జిల్లా రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ అధికారి, హౌసింగ్ పీడీ ఎస్పీ రాజ్ కుమార్, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సెక్టోరల్ ఆఫీసర్ లక్ష్మిరెడ్డి, ఏసీఎంఓ డి .వెంకటేశ్వరనాయక్, గిరిజన సంక్షేమ కార్యాలయ ఏఓ ఎండీ జాఫర్, విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం : డీవీఎంఓ



బహుమతులు అందుకున్న ప్రయాణికులతో డీవీఎంఓ మాధవి, ఆర్టీసీ అధికారులు

నల్లగొండ సిటీ, జూన్ 12 : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని డీవీఎంఓ మాధవి అన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారికి సంస్థ అందించిన బహుమతులకు అర్హులను బుధవారం స్థానిక బస్టాండ్‌లో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. లక్కీడిప్‌లో విజేతలుగా ఎంపికైన కొత్తనాగలక్ష్మి, కర్నాటి ఉమారాణి, వి.ఇంద్ర, కస్తూరి సునీత, అరుణజ్యోతి, కె.రఘు, ఎండీ జహంగీర్, ఏ. శ్రీనివాసులు, ఎం.రాంరెడ్డి, జి.రాంబాబుకు నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నదని చెప్పారు.

ప్రయాణికులు వీటిని వినియోగించుకొని సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని కోరా రు. కార్యక్రమంలో పీఓ వెంకటేశ్, ఏఎంపీ శ్యామలాదేవి, డీఎంలు రామ్మోహన్‌రెడ్డి, పాల్, సీఐ హుస్సేన్, ఏవీఎం జయప్రకాశ్, వెంకటేశం, మెయినొద్దీన్ పాల్గొన్నారు.